క్లుప్తంగా

తురకపాలెం బాధితులకు మెరుగైన చికిత్స అందించాలి

నెహ్రూనగర్: గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో విజృంభించిన జ్వరాలతో పలువురు మృతి చెందడం బాధాకరమని దళిత, బహుజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను కలిసి వారికి అందుతున్న చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే వారికి జ్వరాలు వస్తున్నాయని సూపరింటెండెంట్ తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించి వారికి భరోసా కల్పించాలని కోరారు. మానవత పరిచర్య సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు, బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు, విప్పర్ల ముత్తయ్య, నల్లపు నీలాంబరం, పాటిబండ్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని బాలుడు అదృశ్యం



లక్ష్మీపురం: మతిస్థిమితం లేని బాలుడు అదృశ్యమైన ఘటన పై పట్టాభిపురం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రమౌళినగర్ ప్రాంతానికి చెందిన చింతమనేని మురళీకృష్ణ అనే బాలుడికి పుట్టుకతోనే మతిస్థిమితం లేక పోవడంతో చికిత్స పొందుతు ఉన్నాడు. అయితే గురువారం ఉదయం 11 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బాలుడి తండ్రి శ్యామ్ చుట్టు పక్కల ప్రాంతాలలో పరిశీలించి ఎంతకు జాడ తెలియక పోవడంతో పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు 8688831343, ఎస్సై తరంగిణి 8688831614, బాలుడి తండ్రి శ్యామ్ 897856221, నంబర్లకు సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు.

అలరించిన శ్రీరామాంజనేయ యుద్ధం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదిక్పై గురువారం శ్రీరామాంజనేయ యుద్ధం వార్‌సీన్ పద్య నాటకం ప్రదర్శించారు. పీవీ శంకరరావు ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయపాలక మండలి, అతిథులు జ్యోతి ప్రజల్వనతో ప్రారంభించారు. శ్రీరాముడిగా బిళ్లా జాన్ బాబు, ఆంజనేయుడిగా వెనిగళ్ల బ్రహ్మం చక్కని హావభావాలతో పద్యాలను అలపించారు. హార్మోనియంపై పి.సురేష్, క్లారినెట్‌పై వి.వెంకట్రావు, డోలక్‌పై శ్రీనివాస్, మేకప్ పి.రాము అందించారు. అనంతరం కళాకారులు సత్కరించారు.

22 నుంచి విశ్వబ్రాహ్మణ సమాజం సభ్యత్వ దరఖాస్తులు



నెహ్రూనగర్: ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం ఎన్నికలకు సంబంధించి ఈ నెల 22న సభ్యత్వ దరఖాస్తు ఫారాలు అందజేస్తామని సమాజం ఎన్నికల అధికారి వినుకొండ ప్రసాద్ తెలియజేశారు. గురువారం అరండల్‌పేటలో ఎన్నికల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 22వ తేదీ అరండల్ పేట 4/1 లైన్‌లోని ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం కార్యాలయం వద్ద సభ్యత్వ దరఖాస్తు ఫారాలు అందజేస్తామన్నారు. దేశీయ విశ్వబ్రాహ్మణ సంఘీయులు స్వయంగా వచ్చి రూ.5 రుసుము చెల్లించి, అప్లికేషన్ తీసుకోవాలని చెప్పారు. పూర్తిచేసిన అప్లికేషన్ ఫామ్‌లు నవంబర్ 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు స్వయంగా వచ్చి ఇవ్వాలన్నారు. గుంటూరు నగరం, పరిసర గ్రామాల దేశీయ విశ్వబ్రాహ్మణ సంఘీయులు ఈ ఎన్నికల ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొని నూతన కమిటీ ఎన్నికల్లో సహకరించాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎన్నికల కమిటీ ప్రధానాధికారి వినుకొండ ప్రసాద్ 99517 58577 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో సభ్యులు గోనుగుంట శేషగిరిరావు, చామర్తి శంకర శాస్త్రి, సిద్దు చిరంజీవ ఆచారి, ఆలూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో స్వామిత్వ సర్వే

గుంటూరు రూరల్: జొన్నలగడ్డ గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ అస్ ట్రూతింగ్ కార్యక్రమంలో రోవర్‌తో జరుగుతున్న అంశాలను పరిశీలించారు. సర్వేలకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డిప్యూటీ ఎంపీడీవో ఓ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపుపై ప్రత్యేక దృష్టి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలకసంస్థ పరిధిలో మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్‌లో వ్యర్థాల తొలగింపుపై ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నగర ప్రజలు వర్షాల వల్ల ఏమైనా సమస్య ఎదుర్కొంటే కాల్ చేయడానికి 24 గంటలు అందుబాటులో ఉండేలా నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 08632345103 సిద్ధం చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం నల్లపాడు రోడ్ అవుట్ ఫాల్ డ్రెయిన్, శ్రీరామ్ నగర్ రోడ్ ఆక్రమణల తొలగింపు, ఎస్వీఎస్ కాలనీ, విద్యా నగర్ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వర్షాల వలన లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం వలన తాగునీటి సరఫరాకు సమస్య రాకుండా ఏఈల వారీగా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అవుట్ ఫాల్ డ్రెయిన్లలో వ్యర్థాలు నిలిచే ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఎస్వీఎస్ కాలనీ, నల్లపాడు రోడ్ వంటి ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్, రైట్‌ల వద్ద ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించడానికి వార్డ్ సచివాలయాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. రోడ్లపై డంపింగ్ పాయింట్లు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి..



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డ్ సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందించే ప్రభుత్వ సేవలను, అర్జీల పరిష్కారాన్ని నిర్దేశిత గడువు మేరకు చేపట్టాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్ తెలిపారు. కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు గురువారం డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర నగర్‌లోని 115, 116 వార్డ్ సచివాలయాలని తనిఖీ చేశారు. కార్యదర్శులు సచివాలయం పరిధిలో ప్రజలకు భాధ్యతగా ప్రభుత్వ సేవలు అందించడంలో అంకిత భావంగా ఉండాలన్నారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, ప్రతి కార్యదర్శి తమ విభాగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రధానంగా పీజీఆర్ఎస్ వంటి గ్రీవెన్స్ అర్జీలకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. అడ్మిన్ కార్యదర్శులు అవసరమైతే ఇతర కార్యదర్శుల తోడ్పాటు తీసుకొని నూరు శాతం ఆస్తి, ఖాళీ స్థల పన్ను, నీటి మీటర్ల చార్జీల వసూళ్లకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి



ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చందోలు రవికుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యలపై శాసనమండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు చందోలు రవి కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం బృందావన్‌గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని కలిసిన రవికుమార్ ఉపాధ్యాయ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలలను నాడు-నేడు ద్వారా ఆధునీకరించి, సకల వసతులను సమకూర్చిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో నాడు-నేడు పనులను నిలిపివేశారని తెలిపారు. పాఠశాలలకు పంపిన ఆర్వో వాటర్ ప్లాంట్లను ఇన్‌స్టాల్ చేయక మూలన పడేశారని అప్పిరెడ్డి దృష్టికి తెచ్చారు. ఉపాధ్యాయులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని, డీఏ బకాయిలను చెల్లించిన పరిస్థితులు లేవన్నారు. అదే విధంగా పీఆర్సీ కమిషన్ వేయకపోవడంతో పాటు ఐఆర్ ప్రకటించలేదన్నారు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు పర్చిన మధ్యాహ్న భోజన పథకంలో కేంద్ర ప్రభుత్వం సవరించిన విధంగా విద్యార్థులకు కేటాయింపులు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న శాసనమండలి సమావేశాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ పెదకాకాని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలిని ఆ గ్రామ నివాసి కులం పేరుతో దూషించడం, ఆమెపై దాడిచేయడం దుర్మార్గమన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై, అణగారిన వర్గాలపై దాడులు జరగడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. కార్మికులపై అకారణంగా దాడి చేసినా, దూషించినా సీఐటీయూ సహించదని, న్యాయ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల కుంచనపల్లి గ్రామ అధ్యక్ష కార్యదర్శులు కొక్కిలిగడ్డ ఝాన్సీరాణి, టి. కృష్ణ తులసి, పారిశుద్ధ్య కార్మికులు జోజి బాబు, కోటేశ్వరి, ప్రసాద్, ఇస్సాక్ పాల్గొన్నారు.

18న ఆటో కార్మికుల ‘చలో విజయవాడ’

రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ



సమావేశంలో మాట్లాడుతున్న శివాజీ

లక్ష్మీపురం: వాహన మిత్రను పెంచకుండా ప్రకటించి, ఎన్నికల హామీలను వదిలేసిన చంద్రబాబు వైఖరిని వ్యతిరేకిస్తూ ఈ నెల 18న ఆటో కార్మికుల ‘చలో విజయవాడ’ నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్ పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ తెలిపారు. పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మస్తాన్‌వలి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శివాజీ మాట్లాడారు. అనంతపురంలో సూపర్ సిక్స్- సూపర్ హిట్ పేరుతో నిర్వహించిన సభలో ఆటో కార్మికులందరికీ దసరా పండుగ రోజున వాహనమిత్ర రూ. 15 వేలు అందిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారన్నారు. మహిళలకు ఉచిత బస్సు వల్ల 60 శాతానికి పైగా ఆటో కార్మికులకు ఆదాయం కోల్పోయారని, వాహన మిత్ర సహాయం పెంచాలన్న ఆటో మోటారు కార్మిక సంఘాల అభ్యర్థనను చంద్రబాబు పట్టించుకోలేదని తెలిపారు. పైగా ఐదు ప్రధాన హామీల్లో ఒకదానిని ప్రకటిస్తూ మిగిలిన వాటిని విస్మరించడం చంద్రబాబు అతి తెలివికి నిదర్శనమని విమర్శించారు. ఆటో, క్యాబ్, లారీ వంటి అన్ని వాహనాల డ్రైవర్లకు ఏడాదికి రూ.15వేలు ఇస్తామన్నారని గుర్తు చేశారు. ఇప్పుడు వాహన మిత్ర పేరు మార్చకుండా పాత దాని ప్రకారం అమలు చేస్తే రాష్ట్రంలోని 10 లక్షల డ్రైవర్లలో సుమారు మూడు లక్షల మంది ఆటో, క్యాబ్ ఓనర్ కమ్ డ్రైవర్లకు మాత్రమే రూ.15వేలు అందే పరిస్థితి కనబడుతుందని వివరించారు. ఆగస్టు 15న ఆటో కార్మికుల సంఘాలతో చర్చించడానికి మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేశామన్నారని, ఇప్పుడే ఆ కమిటీ ఏమైందని శివాజీ ప్రశ్నించారు. ఎందుకు ఆటో కార్మిక సంఘాలతో చర్చించలేదని నిలదీశారు. ఈ ప్రభుత్వంలోనే భారీ పెనాల్టీలతో విచ్చలవిడిగా వేలకు వేల రూపాయిలు కేసులు రాస్తున్నారని గుర్తు చేశారు. డ్రైవర్ల సంక్షేమం కోసం వాహనాల నుంచి వసూలు చేస్తున్న లేబర్ సెస్సు నుంచి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకపోవడం, ఆ నిధులను ప్రభుత్వ ఇతర అవసరాలకు వాడుకోవడం దుర్మార్గమని ఖండించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆటో కార్మిక సంఘాలతో చర్చలు జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎం. మురళి, గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆలయాల్లో రాజకీయాలు సిగ్గుచేటు

పట్నంబజారు: ఇప్పటికే తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ అవినీతి భాగోతాలను నియోజకవర్గ ప్రజలు కథలు కథలుగా చెప్పుకొంటున్నారని, ఇవి చాలవన్నట్లుగా ఆలయాల్లోనూ రాజకీయాలు చేయడం సిగ్గు చేటని, దేవుడి దగ్గర కూడా దోచుకోవడం హేయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని తన కార్యాలయలలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ వ్యవహారాల్లో ఎమ్మెల్యే ప్రమేయమేంటంటూ సూటిగా ప్రశ్నించారు. దసరా ఉత్సవాలకు సంబంధించి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రతి ఏడాది కమిటీ వేసుకుని, ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. అయితే ఈ ఏడాది కమిటీలో మెంబర్ అయ్యేందుకు రూ.50వేల వరకు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఆలయానికి సంబంధించి ఛైర్మన్ ఉన్నప్పటికీ.. కమిటీ ఎమ్మెల్యే నసీర్ కనుసన్నల్లో వేయటం దారుణమని మండిపడ్డారు. ఆలయాల్లో బేరాలు..రాజకీయాలు చేయటం సిగ్గుచేటన్నారు. ఉత్సవ కమిటీలో సైతం రాజకీయాలు చేస్తూ.. వైఎస్సార్ సీపీ వాళ్లకు మెంబర్‌షిప్ ఇవ్వకూడదని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేవుడి దగ్గర రాజకీయాలు, పార్టీలు, వ్యక్తిగత ద్వేషాలను తీసుకుని వచ్చే స్థాయికి ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ దిగజారారని దుయ్యబట్టారు.

ఉత్సవాల విషయంలో మీ ప్రమేయమేంటీ?

ఉత్సవాల విషయంలో అసలు నసీర్ ప్రమేయం ఏంటో చెప్పాలని నూరి ఫాతిమా డిమాండ్ చేశారు. 2023 సంవత్సరంలో ఎమ్మెల్యేగా షేక్ మొహమ్మద్ ముస్తఫా ఉన్న సమయంలో, ఉత్సవాలు జరిగాయని, మొత్తం బాధ్యతలు కమిటీ మాత్రమే చూసుకుందని, కేవలం రూ.56లక్షలతో అంగరంగ వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. మాజీ ఎమ్మెల్యే ముస్తఫా ఏ ఒక్క రోజు కూడా ఆలయ అంశాల్లో వేలు పెట్టలేదని, అయినప్పటికీ ఆయనపై పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 సంవత్సరంలో రూ.కోటిపైగా వసూళ్లకు కూటమి నేతలు పాల్పడ్డారని, అయితే ఇప్పటికీ ఎంత ఖర్చు చేశారనేది తెలియరాలేదని, ఇంకా రూ 4లక్షల అప్పు ఉందని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. రికార్డులు సైతం స్పష్టంగా లేని పరిస్థితులు దాపురించాయని, కమిటీకి ఇవ్వాల్సిన మర్యాద కూడా ఇవ్వకుండా ఎమ్మెల్యే నసీర్, మిగతా కూటమి నేతలు కొందరు కలిసి అమ్మవారి సొమ్మును దోచుకుతింటున్నారని ధ్వజమెత్తారు.

97 మందితో కమిటీనా..?

అమ్మవారి ఉత్సవాలకు సంబంధించి 97 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు ఏంటో అర్థం కావటం లేదని, ఇంతకు ముందెన్నడూ అంత మందితో కమిటీలు లేవన్నారు. ఆలయంలోని లెక్కలు.. వాటి వివరాలు, వసూళ్ల గురించి ఎమ్మెల్యే నసీర్‌కు ఎందుకని ప్రశ్నించారు. ఎంతో మంది పేదలకు ఉపయోగపడే అన్నదాన కార్యక్రమాన్ని నిలిపివేశారని, కనీసం మంచినీరు వస్తున్న పరిస్థితి లేదని, ఆలయం బయట ఉన్న షెడ్డును సైతం తీసేశారని, ఇంతటి పాపాలు మూటగట్టుకుంటున్న ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

స్మార్ట్ కార్డులను ప్రభుత్వమే ఇంటింటికీ ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

లక్ష్మీపురం: రేషన్ కార్డుల తప్పులను ప్రభుత్వమే సరిచేయాలేగానీ, ప్రజలపై భారం మోపడం సరికాదని, పాత రేషన్ కార్డుల స్థానంలో ఇచ్చే స్మార్ట్ కార్డులలో తప్పులను ప్రభుత్వమే ఉచితంగా సరిచేయాలని, కార్డులను ఇంటింటికీ పంపిణీ చేస్తామని చెప్పిన హామీని నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. పాత గుంటూరులోని సుందరయ్య భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు తీసుకునిరావడం మంచి విషయమే అయినప్పటికీ ఈ కార్డులో వచ్చిన తప్పులకు ప్రభుత్వానిదే బాధ్యత కాబట్టి వాటిని ఉచితంగా సరిచేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం స్మార్ట్ కార్డులు సచివాలయ అధికారులు ఇంటికి వచ్చి ఇస్తారని చెప్పిందనీ, కానీ ఆచరణలో అమలు జరగడం లేదని, ఇది అమలు జరిగే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల ఐలమ్మ, రామకృష్ణ ఆదర్శనీయులు



మాట్లాడుతున్న రజక వృత్తి దారుల సంఘం నాయకులు

లక్ష్మీపురం: భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి బానిసత్వ విముక్తి కోసం పీడిత ప్రజలకు అండగా వీరోచిత పోరాటం చేసిన వీరనారి చిట్యాల ఐలమ్మ ఆశయాల సాధనకై అంకితమై పనిచేస్తామని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లభాపురం వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. గుంటూరు చంద్రమౌళి నగర్ పోస్ట్ ఆఫీస్ వద్ద అమరజీవి చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. అదేవిధంగా 2000 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరెంటు చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో బషీర్‌బాగ్ వద్ద ప్రభుత్వం నిర్వహించిన దమన కాండలో అమరుడైన ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నాటి రాష్ట్ర కన్వీనర్ సత్తెనపల్లి రామకృష్ణ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించాడన్నారు. అటువంటి వారి ప్రాణ త్యాగాలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.
సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు మాట్లాడుతూ రజక వృత్తి దారులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిందని, అయితే నేటికీ నెరవేర్చలేదన్నారు. ఆదరణ-3 పథకం ద్వారా రజకవృత్తి దారులకు అవసరమైన ఆధునిక వృత్తి పరికరాలను వెంటనే సరఫరా చేయాలని, ప్రతి రజక వృత్తిదారునికి 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐలమ్మ విగ్రహానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సర్వేల నుంచి మినహాయించండి



కమిషనర్‌కు ఉద్యమ కార్యాచరణ నోటీసు అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

నెహ్రూనగర్: సర్వేల నుంచి సచివాలయ ఉద్యోగులకు విముక్తి కలిగించాలని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు షేక్ అబ్దుల్ రజాక్ విన్నవించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక పిలుపు మేరకు గురువారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులను కలిసి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఉద్యమ కార్యాచరణ నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు సర్వేల నుంచి విముక్తి కలిగించాలని, వారిని మాతృ శాఖలకు అప్పగించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, రావాల్సిన బకాయిలు ఇవ్వాలని, స్పష్టమైన సర్వీస్ రూల్స్ రూపొందించి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు అప్ గ్రేడ్ చేయాలని, బదిలీలకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలతో జీవో ఇవ్వాలని, సచివాలయ ఉద్యోగుల సీనియార్టీ జాబితా ప్రచురించాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర జేఏసీ 15 రోజుల గడువుతో ఈ ఉద్యమ కార్యాచరణ నోటీసులను ప్రభుత్వానికి అందించిందని, జేఏసీ పిలుపులో భాగంగా ఆ నోటీసులను క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు కూడా అందజేస్తున్నామని జేఏసీ నాయకులు తెలిపారు. నాయకులు ధనలక్ష్మి, మధులత, సందీప్, అనురాధ, మధు, సతీష్, హరికృష్ణ, నజీర్, సుభాని, మహేష్, శేషగిరి, కొండలరావు, దీప్తి, ప్రశాంతి, వాసు, గురుబ్రహ్మం, ప్రవీణ్, రవి మాధవ్, యుగంధర్, నందిని తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన చేపల మార్కెట్



నీట మునిగిన చేపల మార్కెట్

నెహ్రూనగర్: నగరంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు నీటి మునిగాయి. ముఖ్యంగా మూడు వంతెనలు, కంకరగుంట బ్రిడ్జి, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాలు, పాతగుంటూరు, నెహ్రూనగర్, కొరిటెపాడు, విద్యానగర్ తదితర ప్రాంతాల్లోని లోతట్టు వీధులు జలమయంగా మారాయి. దీంతో నగర వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపై నీటిని ఇంజినీరింగ్ అధికారులు మోటార్ల సాయంతో బెయిల్ అవుట్ చేశారు. మార్కెట్‌లోని వెన్‌లాక్ మార్కెట్(చేపల మార్కెట్) నీట మునిగిపోవడంతో వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా ఓ ద్విచక్రవాహనదారుడు ఏటీ అగ్రహారం పీకలవాగులో ప్రమాదవశాత్తు పడిపోగా, స్థానికులు కాపాడారు.



పీకలవాగులో పడిపోయిన ద్విచక్ర వాహనం

14న బ్రాహ్మణోత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జ్వాలాపురం శ్రీకాంత్ తదితరులు

నెహ్రూనగర్: భావి భారతావనికి ఉపాధ్యాయులే ఉత్తమ రూపకర్తలని, గొప్ప సమాజ దార్శనీకులని మాజీ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ పేర్కొన్నారు. భావి భారత పౌరులకు విద్య, విజ్ఞానంతో పాటు సామాజిక దృక్పథంతో కూడిన సరైన దశలో నడిపించడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ బ్రాహ్మణ ఉపాధ్యాయులందరినీ ఒక వేదికపై చేర్చే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. అందులో భాగంగా ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణ వర్గానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులకు ఈనెల 14వ తేదీన ఘన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వర్గానికి చెందిన ప్రముఖులు హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేస్తారని ఆయన వివరించారు. తొలుత సన్మాన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), కొతా సుబ్బారావు, నిమ్మరాజు శారద తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ గోడ దూకి విద్యార్థి పరారీ

లక్ష్మీపురం: విద్యార్థి హాస్టల్ గోడ దూకి పారిపోయిన సంఘటనపై అరండల్‌పేట పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బ్రాడీపేట ఒకటో లైను 11వ అడ్డరోడ్డులోని మాస్టర్‌మైండ్స్ కళాశాలలో సీఏ ఫౌండేషన్ కోర్సు చదువుతున్న సాకేత్ సాయి అనే విద్యార్థి అదే ప్రాంతంలోని కళాశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం విద్యార్థికి జ్వరం రావడంతో హాస్టల్ నిర్వాహకులకు చెప్పా పెట్టకుండా హాస్టల్ గోడదూకి పారిపోయాడు. ఈ విషయమై విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేసి చుట్టుపక్కల వెదికినా, కనిపించకపోవడంతో గురువారం రాత్రి కళాశాల ఏఓ తిరుమల శెట్టి శివయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చేబ్రోలు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి ఊర్మిళాదేవి అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలు ఎంపీపీ పాఠశాలలో గురువారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.